మన మీ.. వార్త
ప్రతి అక్షరం... ప్రజల కోసం
TGBIL/25/A0512
ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం
25 అక్టోబర్ 2026
పేజీలు : 4
@mvaartanews
www.mivaartanews.com

## చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో అధ్యాపకుల పరిశోధనా నైపుణ్యాల పెంపునకు ఏఐ పవర్డ్ రీసెర్చ్ ఎక్సలెన్స్ వర్క్‌షాపు.

**ఖమ్మం అక్టోబర్ 24 మీ వార్త ప్రతినిధి:**

ఖమ్మం సమీపంలో స్థానిక పొన్నేకల్‌లోని శ్రీ చైతన్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ రీసెర్చ్ లో అధ్యాపకుల సాంకేతిక, పరిశోధనా నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో స్కిల్ బిల్డ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంశంపై రెండు రోజుల వర్క్‌షాప్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆస్ట్రేలియాలోని యూనివర్సిటీ ఆఫ్ న్యూకాక్యాస్టల్ కు చెందిన ప్రొఫెసర్ డాక్టర్ అసాది శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరుకాగా, సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ గొడ్డేనల శ్రీనివాస్ పాల్గొన్నారు. కార్యక్రమ ప్రారంభంలో అతిథులు, కళాశాల ప్రతినిధులు జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాప్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ శ్రీ మల్లెంపాటి శ్రీధర్ మాట్లాడుతూ, ప్రస్తుత డిజిటల్ యుగంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కీలక పాత్ర పోషిస్తోందని, అధ్యాపకులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని నిరంతరం అభ్యసించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. భవిష్యత్తులో ఏ ఐ,డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి రంగాల్లో విస్తృతమైన ఉద్యోగ, పరిశోధనా అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వెంకటాచలపతి మాట్లాడుతూ, అధ్యాపకులు ఇలాంటి వర్క్‌షాప్‌లను సద్వినియోగం చేసుకుని పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని అన్నారు. విద్యార్థుల్లో పరిశోధన పట్ల ఆసక్తిని పెంచడంతోపాటు, నూతన ఆవిష్కరణలు, పరిశోధన ఆధారిత ప్రాజెక్టుల రూపకల్పనకు అధ్యాపకులు మార్గదర్శకులుగా నిలవాలని




సూచించారు. ఈ వర్క్‌షాప్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సు ఆధారిత పరిశోధనా సాధనాలను వినియోగించడం, నాణ్యమైన పరిశోధనా పత్రాలను రూపొందించడం, అంతర్జాతీయ స్థాయి ప్రచురణలకు సిద్ధం కావడం, పేటెంట్ల దిశగా నూతన ఆవిష్కరణలను అభివృద్ధి చేయడం వంటి అంశాలపై అధ్యాపకులు తమ సందేహాలను నివృత్తి చేసుకుని పరిశోధనకు సంబంధించిన అనేక ఆచరణాత్మక విషయాలను తెలుసుకోవచ్చు అన్నారు ముఖ్య అతిథి ప్రొఫెసర్ డాక్టర్ అసాది శ్రీనివాసులు మాట్లాడుతూ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆరోగ్యం, విద్య, పరిశ్రమ, వ్యవసాయం వంటి అనేక రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోందని వివరించారు. ఈ వర్క్‌షాప్‌లో భాగంగా అధ్యాపకులకు ఏ ఐ ప్రాథమిక అంశాలు, మెషీన్ లెర్నింగ్, డేటా అనలిటిక్స్, పరిశోధనలో ఏ ఐ వినియోగం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. పరిశ్రమల్లో ప్రస్తుతం అవసరమైన సాంకేతిక నైపుణ్యాలు, ప్రాజెక్టుల ప్రాముఖ్యత, నూతన సాంకేతిక పరిజ్ఞానంతో లభించే ఉద్యోగ అవకాశాలను వివరించారు. అలాగే, నాణ్యమైన పరిశోధనా పత్రాల రచన అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురణలు పరిశోధనా ఫలితాల విశ్లేషణ,



సరైన జర్నల్స్ ఎంపిక, సైటేషన్లు, ప్లేజరిజం నివారణ, పరిశోధనా నైతికత వంటి అంశాలపై ప్రత్యేకంగా చర్చించారు. పరిశోధనలో కృత్రిమ మేధస్సును బాధ్యతాయుతంగా వినియోగిస్తూ, స్వతంత్ర ఆలోచనలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అదేవిధంగా, అధ్యాపకులు తమ పరిశోధనలను నూతన ఆవిష్కరణలుగా అభివృద్ధి చేసి పేటెంట్ల కోసం దరఖాస్తు చేయడం, మేధో సంపత్తి హక్కుల పరిరక్షణ, పేటెంట్ శోధన, ఆవిష్కరణల వాణిజ్యీకరణ వంటి అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలని వివరించారు. పరిశోధనా పత్రాల ప్రచురణలు, పేటెంట్లు, పరిశ్రమలతో సంయుక్త పరిశోధనలు, ప్రాజెక్టుల రూపకల్పన ద్వారా విద్యాసంస్థల పరిశోధనా ప్రమాణాలను మరింత మెరుగుపరచవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కలశాల డీన్ అకాడమిక్స్ డాక్టర్ సుదర్శన్, ప్రోగ్రాం కోఆర్డినేటర్ రీసెర్చ్ ఇన్నోవేషన్ హెడ్ డాక్టర్ మురళి మోహన్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ వైశాలి,ట్రైనింగ్ ప్లేసెమెంట్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్, డిప్లొమా ఇంచార్జి కృష్ణ ప్రసాద్ వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎన్నికలలో పోటీ చేస్తాం.

- సిపిఐ.యం ఖమ్మం జిల్లా కారదర్శి నున్నా నాగేశ్వరరావు.

**ఖమ్మం అక్టోబర్ 24 మీ వార్త ప్రతినిధి:**

ఖమ్మం నల్గొండ వరంగల్ నియోజకవర్గ పరిధిలో జరగబోయే గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికలలో పోటీ చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని సీపీఎం పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు ప్రకటించారు. స్థానిక సుందరయ్య భవనంలో సీపీఎం పార్టీ ఖమ్మం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కల్యాణం వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే సంవత్సరం ఫిబ్రవరి లేదా మార్చి నెలలో జరగబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో నల్గొండ, ఖమ్మం, వరంగల్ పట్టభద్రుల స్థానానికి జరిగే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో పోటీ చేస్తామని, అందుకోసం కలిసొచ్చే వ్యక్తులు,శక్తులతో చర్చలు జరుపుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి యువజన మహిళ శ్రామిక ఉద్యోగ మేధావుల సమస్యల కేంద్రంగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తామని అన్నారు. అంతేకాక దేశ రాష్ట్ర అభివృద్ధికి కీలకమైన రాజకీయ అంశాలపై సైతం




ప్రచారాన్ని చేస్తామని,ప్రజల వద్దకు వెళ్ళి ఈ విషయాల ప్రాధాన్యతను వివరిస్తామని ఆయన తెలిపారు. దేశంలో రాష్ట్రంలో చదువుకున్న యువజనుల సంఖ్య కోట్ల సంఖ్యలో ఉందని,వీరికి అవసరమైన గౌరవప్రద ఉపాధిని కల్పించవల్సిన అవసరం ప్రభుత్వాలకు ఉందని అన్నారు. ప్రభుత్వాలు మాత్రం ఈ విషయంలో ఘోరంగా విఫలం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెరుగుతున్న నిరుద్యోగమే ఈ విషయంలో తిరుగులేని సాక్ష్యమని అన్నారు. ఈ సామాజిక ఆర్థిక సంక్షోభంలో నుండే యువత పెద్ద ఎత్తున ఉద్యమాలలోకి వస్తున్నారని, ప్రభుత్వాలను ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రశ్నిస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు నిరుద్యోగ సమస్యను పరిష్కరించేందుకు ప్రణాళికలు రచించాలని సూచించారు. లేకపోతే యువత అశాంతికి



అభద్రతకు గురై అతివాద ఉద్యమాల వైపు ఆకర్షితులయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. త్వరలో జరిగబోయే పట్టభద్రుల ఎన్నికలలో ఈ విషయాలన్నింటినీ ప్రజల దగ్గరికి తీసుకువెళ్తామని, పట్టభద్రులను ఓటు అభ్యర్థిస్తామని అన్నారు. అందుకోసం వామపక్ష ప్రజాస్వామిక శక్తుల సహకారంతో తాము పట్టభద్రుల ఎన్నికలలో చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు పొన్నం. వెంకటేశ్వరరావు, యం.సుబ్బారావు, మాదినేని రమేష్, మెరుగు సత్యనారాయణ, యర్రా శ్రీనివాసరావు, బండారు రమేష్, నందిపాటి మనోహర్, దొంగల తిరుపతిరావు, నవీన్ రెడ్డి, భుక్యా శ్రీనివాసరావు, పి.ఝాన్సీ, యస్ కె మీరా, నాగుల్ మీరా, బత్తిని ఉపేందర్, బోడపట్ల సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం జిల్లా కరువు ప్రాంతంగా ప్రకటించాలి టీడీపీ డిమాండ్.

**ఖమ్మం అక్టోబర్ 24 మీ వార్త ప్రతినిధి:**

తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో పాలేరు మాజీ ఇంచార్జ్, జిల్లా అడ హాక్ కమిటీ సభ్యులు కొండబాల కరుణాకర్, ఖమ్మం జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ.. ఖమ్మం జిల్లా లో ఒక పక్క పాలేరు చెరువులో మరోపక్క వైరా ప్రాజెక్టులో నిండా నీళ్లు ఉన్నా ప్రభుత్వ అసమర్థత వల్ల పంటలు ఎండిపోతున్నాయి. ఈ జిల్లాలో ఉన్న మంత్రులు ఒక పని చేసి దానికి అనేక సార్లు ప్రకటనలు ఇస్తున్నారు. జిల్లాలో విష జ్వరాలు ప్రబలి ప్రజలు పిట్టల్లా రాలిపోతున్నారు ఐనా ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుంది, ఎల్ నినో తదితర వాతావరణ ప్రభావంతో లోటు వర్షపాతంతో ఖమ్మం జిల్లా రైతాంగానికి కన్నీరు మిగిలింది. వరి, పత్తి, మొక్కజొన్న



తదితర పంటలు చేతికి వచ్చే దశలో నీరు లేక ఎండిపోయాయి, రైతు పరిస్థితి అగమ్యగోచరంగా ఉన్నది, ప్రభుత్వం వెంటనే స్పందించి ఎండిపోయిన పంట పొలాలను ఇతర పంటలను అధికారులతో సర్వే చేయించి ఎకరాకు 50,000 రూపాయలు చొప్పున నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. ఒక ప్రక్క ఎండ వేడిమితో పంటలు ప్రజలు అల్లాడుతుంటే, గ్రామాల్లో అప్రకటిత విద్యుత్తుకోతలు విధిస్తున్నారు బావులు, బోర్ల క్రింద వున్న పంటలు విద్యుత్ లేక ఎండుతున్నాయి కనీసం బోర్లు బావులు వున్న చోటైనా విద్యుత్ అందించి, పంటలను కాపాడాలని, పంటలు ఎండితే ఆహారోత్పత్తి పై ప్రభావం పడుతుంది, సామాన్యుడి బతుకు ప్రశ్నార్థకంగా మారుతుంది. కావున రైతుల పంటలను కాపాడే చర్యలు ప్రభుత్వం వెంటనే చేపట్టాలని మేము ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. ఈ సమావేశంలో లీగల్ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లెంపాటి అప్పారావు, జిల్లా నాయకులు నాగార్జున శ్రీనివాస్, వాసిరెడ్డి భాస్కర్ రావు, పాలడుగు కృష్ణ ప్రసాద్, రాయల కోటేశ్వరరావు, చావా రామారావు, కామినేని శ్రీనివాస్, నల్లమోతు సత్యనారాయణ, కర్నాటి అశ్వినీ కుమార్, నామా ఉపేందర్, మల్లెంపాటి లహరన్, దామాల శివ, కావూరి సత్యనారాయణ, కన్నె వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

### బాధిత కుటుంబాలను పరామర్శించిన కాంగ్రెస్ నేత

**కారేపల్లి అక్టోబర్ 23 మీ వార్త ప్రతినిధి:**

బాధిత కుటుంబాలు అధైర్య పడవద్దని కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని కాంగ్రెస్ నేత మాజీ సర్పంచ్ అజ్మీర్ నరేష్ అన్నారు మండల మాదారం గ్రామపంచాయతీ పరిధిలోగల గోవింద్ తండా గ్రామంలో శనివారం కుటుంబాలను పరామర్శించిప్రమాదవశాత్తు వివిద కారణాలు వల్ల గాయపడిన పలు కుటుంబాలకు ఓదార్పు మనోధైర్యం కల్పించారు. పార్టీలకు అతీతంగా విస్తృత సేవలు అందజేస్తున్నట్టు తెలిపారు. ప్రమాద బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారాసీఎంఆర్ఎఫ్ ద్వారా రావాల్సిన సహాయాన్ని అందజేస్తామన్నారు. గ్రామానికి చెందిన పాప నాయక్ అల్లుడు రాజేష్ బానోత్ శివ వినోద్ కుటుంబాలన ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలోఉప సర్పంచ్ బానోతు లాలూమంగా వార్డ్ మెంబర్స్ బానోత్ సౌందర్య నగేష్ శ్రీ నాయకులు బర్మావత్ గోవిందు నాయక్ బాదావత్ వీరు నాయక్ టిఆర్ఎస్ నాయకులు భానోత్ కోటేశ్వరరావు మల్లికార్జున్ కాంగ్రెస్ నాయకులు వంకుదోత్ వీరన్న బట్టు నరసయ్య గ్రామ యువ నాయకులు బర్మావత్ వీర నాయక్ ముదిగొండ వెంకన్న కళ్యాణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



## సత్తుపల్లి ప్రభుత్వ బాలికల కళాశాలలో డీఐఈవో ఆకస్మిక తనిఖీ.

- ల్యాబ్‌లు, రీడింగ్ రూమ్, లైబ్రరీ పరిశీలన.
- విద్యార్థినులకు మెరుగైన విద్యా వసతుల కల్పనే లక్ష్యం.

**సత్తుపల్లి అక్టోబర్ 24 మీ వార్తఅర్ సి:**

సత్తుపల్లి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఖమ్మం జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి (డీఐఈవో) రవికుమార్, ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. కళాశాలలోని ల్యాబ్‌లు, రీడింగ్ రూమ్, లైబ్రరీలను పరిశీలించి విద్యార్థినులకు అందుబాటులో ఉన్న విద్యా వసతులను సమీక్షించారు. ఈ సందర్భంగా ప్రయోగశాలల్లోని పరికరాలు, విద్యార్థినుల అధ్యయనానికి అవసరమైన సౌకర్యాలు, గ్రంథాలయంలోని పుస్తకాలు, రీడింగ్ రూమ్ నిర్వహణ తదితర అంశాలను పరిశీలించారు.



**పుస్తక జ్ఞానంతో పాటు ప్రయోగాత్మక విద్యకూ ప్రాధాన్యం.**

విద్యార్థినుల భవిష్యత్తుకు పునాది వేసే ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు అత్యంత కీలకం. ముఖ్యంగా సైన్స్ విద్యార్థినులకు ప్రయోగశాలలు, పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి గ్రంథాలయం, ప్రశాంతంగా చదువుకునేందుకు రీడింగ్ రూమ్ ఎంతో అవసరం. ఈ నేపథ్యంలో డీఐఈవో ఆకస్మిక తనిఖీ ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రభుత్వ కళాశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుదలతో పాటు విద్యార్థినులకు అందుతున్న సౌకర్యాలపై అధికారుల నిరంతర పర్యవేక్షణ అవసరమనే అంశాన్ని ఈ తనిఖీ మరోసారి ముందుకు తెచ్చింది.

## కార్మికులకు కనీస వేతనం గా రూ.26 వేలు ఇవ్వాలి.

- సిఐటియు మండల కన్వీనర్ బాదావత్ శ్రీను.



**కామేపల్లి అక్టోబర్ 24 మీ వార్త ప్రతినిధి:**

కామేపల్లి సిఐటియు మండల కమిటీ ఆధ్వర్యం లో డాక్టర్ శ్రీదేవి, ఎంఈఓ జి.వెంకట్ లకు ఆశా వర్కర్లు, మధ్యాహ్న భోజన కార్మికులు సమస్యలతో కూడిన వినతిపత్రంను శనివారం అందజేశారు. కనీస వేతనం గా రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. కార్మికుల న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఈనెల 26న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని ధర్నాను జయప్ర దం చేయాలని కోరారు. ఈ కార్యక్రమం లో సిఐటియు మండల కన్వీనర్ బాదావత్ శ్రీను, మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ మండ ల కార్యదర్శి లింగం జయ మ్మ,ముత్తమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మంలో ఘనంగా ఒప్రేయా డైమండ్ ప్రారంభోత్సవం.



**ఖమ్మం అక్టోబర్ 24 మీ వార్త ప్రతినిధి:**



ఖమ్మం నగరంలోని గ్రాండ్ గాయత్రి వేదికగా ఒప్రేయా డైమండ్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఫౌండర్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ క్రాంతి మండాతి ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయటం జరిగింది. ఈ కార్యక్రమం ద్వారా డైమండ్ ఆభరణాల ప్రత్యేకతలు, నాణ్యత, ఆకర్షణీయమైన డిజైన్లను ప్రజలకు పరిచయం చేయనున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమం ఆభరణాల ప్రియులకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. ప్రారంభోత్సవ వేడుకల్లో ప్రముఖులు, ఆహ్వానితులు, వినియోగదారులు పాల్గొనే అవకాశం ఉంది. ఒప్రేయా డైమండ్ సంస్థ అభివృద్ధి, వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులను అందించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒప్రేయా డైమండ్ ఫౌండర్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ క్రాంతి మండాతి తెలిపారు.

## అక్టోబర్ 26న శ్రీ మహర్షి వాల్మీకి జయంతి నిర్వహణ జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్.

ఖమ్మం అక్టోబర్ 24 మీ వార్త ప్రతినిధి:

అక్టోబర్ 26న ఉదయం 10 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో శ్రీ మహర్షి వాల్మీకి జయంతి కార్యక్రమం నిర్వహించి, వారి చిత్రపటానికి పుష్పమాలంకరణ చేయడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టి ఎస్ ఒక ప్రకటనలో తెలిపారు. జయంతి కార్యక్రమంలో ప్రజలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, కుల సంఘాల నాయకులు, ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ఆస్పత్రుల్లో వైద్య చికిత్సల ధరల పట్టికలను తప్పనిసరిగా ప్రదర్శించాలి

**- కరకగూడెం బీజేపీ మండల అధ్యక్షుడు జుజ్జూరి నరేష్ డిమాండ్.**

కరకగూడెం అక్టోబర్ 24 మీ వార్త ప్రతినిధి:



ఆస్పత్రుల్లో అందించే వైద్య పరీక్షలు, చికిత్సలకు సంబంధించిన ధరల వివరాలను డిస్ప్లే బోర్డులపై ప్రజలకు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించేలా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కరకగూడెం బీజేపీ మండల అధ్యక్షుడు జుజ్జూరి నరేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు.

ఈ సందర్భంగా జుజ్జూరి నరేష్ మాట్లాడుతూ, దేశంలోని అన్ని ఆస్పత్రుల్లో వైద్య పరీక్షలు, చికిత్సలకు సంబంధించిన ధరల పట్టికలను ప్రదర్శించేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అన్ని రాష్ట్రాలకు సూచించిందని గుర్తుచేశారు. ఈ మేరకు అన్ని రాష్ట్రాల ప్రధాన కార్యదర్శులకు కేంద్ర ప్రభుత్వం లేఖలు కూడా రాసిందని తెలిపారు. ప్రతి వైద్య పరీక్ష మరియు చికిత్సకు సంబంధించిన రుసుములను ఇంగ్లీష్‌తో పాటు స్థానిక భాషలోనూ డిస్ప్లే బోర్డులపై ప్రదర్శించాలని కేంద్రం స్పష్టం చేసిందని, ఈ నిబంధనలను పక్కాగా అమలు చేసే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపైనే ఉందని ఆయన పేర్కొన్నారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందే రోగులకు ముందుగానే వైద్య సేవల ధరలపై స్పష్టమైన అవగాహన కల్పించడం ద్వారా, బిల్లుల చెల్లింపు సమయంలో తలెత్తే వివాదాలు మరియు దోపిడీలను నివారించవచ్చని నరేష్ అభిప్రాయపడ్డారు. ధరల వివరాలు బహిరంగంగా అందుబాటులో లేకపోవడం వల్ల రోగులు, వారి కుటుంబ సభ్యులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని, అధిక బిల్లులపై తరచూ ఫిర్యాదులు వస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు పారదర్శకమైన వైద్య సేవలు అందించడంతో పాటు, రోగులపై అనవసర ఆర్థిక భారం పడకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కాబట్టి కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఆదేశాలు జారీ చేయాలని, రాష్ట్రంలోని ప్రైవేట్ మరియు కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్య సేవల ధరల పట్టికలను తప్పనిసరిగా ప్రదర్శించేలా కఠిన చర్యలు తీసుకోవాలని జుజ్జూరి నరేష్ తన ప్రకటనలో డిమాండ్ చేశారు.

## సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టులో భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందజేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే జారె ఆదినారాయణ.

దమ్మపేట అక్టోబర్ 24 మీ వార్త ఆర్ సి వనమాల శ్రీనివాసరావు:



నాగుపల్లి గ్రామంలో రైతులకు పరిహారం పంపిణీ. దమ్మపేట మండలం నాగుపల్లి గ్రామంలో సీతారామ ఎత్తిపోతల పథకం సత్తుపల్లి ట్రంక్ కెనాల్ నిర్మాణం కోసం భూములు కోల్పోయిన రైతులకు రాష్ట్ర వ్యవసాయ, చేనేత, సహకార మార్కెటింగ్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ప్రభుత్వం మంజూరు చేసిన నష్టపరిహారం చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు కక్కిరాల రమేష్, ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కనీసవేతనం, ఉద్యోగ భద్రతకై పోరాటం.

**- సమస్య సాధనకై 26న చలో హైదరాబాద్ సీఐటీయూ.**

కారేపల్లి అక్టోబర్ 23 మీ వార్త ప్రతినిధి:



పల్లెలలో వైద్య సేవలు, వైద్య సర్వేలు నిర్వహిస్తూ ఆరోగ్య సమాజం కోసం పాటుపడుతున్న ఆరోగ్య కార్యకర్తలకు కనీస వేతనాలు, ఉద్యోగ భద్రత లేకుండా పోయిందని సీఐటీయు జిల్లానాయకురాలు ఎల్లబోయిన రాధ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కొండబోయిన నాగేశ్వరరావు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం హెల్త్ వర్కర్ల సమస్యలపై మండల వైద్యాధికారి సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్‌లతో పని గంటలు పెరగటం కార్మిక హక్కులు కోల్పోవటంతో పాటు వెట్టి లోకి నెట్టపడతారన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు నిర్ణయించి అమలు చేయాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, స్కీమ్ వర్కర్లను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన, ఐకేపీ, ఫీల్డ్ అసిస్టెంట్లు, గ్రామపంచాయతీ, భవన నిర్మాణ, హమాలీ, ఆర్టీసీ, సింగరేణి, విద్యుత్ వంటి రంగాల కార్మికులకు వేతనాలు పెంచుతామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కాంగ్రెస్, అధికారంలోకి వచ్చాక వాటిని అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అక్టోబర్ 26న హైదరాబాద్ ఇందిరా పార్క్ ధర్నా చౌక్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో అందోళనను జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు జంగా కళ్యాణి, వాంకుడోత్ కమల, జీపీ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షులు శాతరాజుపల్లి నాగేశ్వరరావు, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల కార్యదర్శి ఎస్ నాగమణి, ఎం కుమారి. జి స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయానికి ఆటంకాలు.

**- రైతులు అప్రమత్తంగా ఉండాలి.. ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలి.**

**- సుబ్బంపేట రైతు సదస్సులో ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల గోపాల బుచ్చిబాబు.**

చర్ల అక్టోబర్ 24 మీ వార్త ప్రతినిధి:



వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది వ్యవసాయ రంగం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని, రైతులు పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని ఆత్మ కమిటీ చైర్మన్ ఇందల గోపాల బుచ్చిబాబు సూచించారు. శనివారం చర్ల మండలం సుబ్బంపేట గ్రామంలో నిర్వహించిన రైతు సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎల్‌నినో ప్రభావం కొత్తదేమీ కాదని, అయితే ఈ ఏడాది దాని ప్రభావం వాతావరణ పరిస్థితులపై తీవ్రంగా కనిపిస్తోందని తెలిపారు. జూన్ మొదటి వారం నుంచే రుతుపవనాలపై ప్రభావం పడటంతో సరైన సమయంలో వర్షాలు కురవకపోవడం, చెరువులు, కుంటలు, ప్రాజెక్టులు ఆశించిన స్థాయిలో నిండకపోవడం వంటి పరిస్థితులు ఏర్పడ్డాయని వివరించారు. పసిఫిక్ మహాసముద్ర ఉపరితల ఉష్ణోగ్రతల్లో మార్పుల కారణంగా వాతావరణ సమతుల్యత దెబ్బతిని, సకాలంలో వర్షాలు కురవక వ్యవసాయానికి ఆటంకాలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా పలు ప్రాంతాలు ఇటువంటి వాతావరణ సమస్యలను ఎదుర్కొంటున్నాయని చెప్పారు.

**రైతులు ధైర్యంగా ఉండాలి:** గతంలో కరోనా వంటి విపత్కర పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొన్న మనం, ప్రస్తుతం వ్యవసాయ రంగంలో ఎదురవుతున్న సవాళ్లను కూడా ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవాలని బుచ్చిబాబు రైతులకు పిలుపునిచ్చారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని వేసవిలో నీటి వినియోగం అధికంగా ఉండే వరి సాగుకు దూరంగా ఉండాలని, ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి సూచించిన విషయాన్ని గుర్తుచేశారు.రైతులకు ప్రత్యామ్నాయ పంటల సాగుపై అవగాహన కల్పించడంతో పాటు, అవసరమైన విత్తనాలను అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వచ్చే వారంలో రైతులకు అనుకూలమైన మినుములు, పెసలు వంటి ఆరుతడి పంటల విత్తనాలను సరైన సమయంలో అందించేందుకు కృషి చేస్తామని వెల్లడించారు.

**ప్రభుత్వం ప్రకటించిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి.**

మార్కెట్ కమిటీ చైర్మన్ ఏర్ప శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు రైతులకు అనుకూలంగా లేవని అన్నారు. అయినప్పటికీ రైతులు ఇప్పటివరకు అనేక ఇబ్బందులను అధిగమిస్తూ వ్యవసాయాన్ని కొనసాగించారని పేర్కొన్నారు. రైతులు తమ పంటలను విక్రయించే సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం ప్రకటించిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం, మిరప పంటలను విక్రయించాలని కోరారు. రైతులు దళారుల బారిన పడకుండా, తమ పంటలకు గిట్టుబాటు ధర లభించేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ రైతు సదస్సులో వ్యవసాయ అధికారి (ఏఓ), వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓలు), గ్రామపంచాయతీ అధ్యక్షుడు, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

# నేటితో ముగియనున్న కోట మైసమ్మ జాతర అయిదవ రోజు ఘనంగా కొనసాగిన జాతర

కారేపల్లి అక్టోబర్ 23 మీ వార్త ప్రతినిధి:

దసరా సందర్భంగా సింగరేణి మండలం ఉసిరికాయల పల్లిలో కొలువై ఉన్న కోట మైసమ్మ తల్లి దేవాలయం వద్దప్రారంభమైన జాతర, ఆదివారం ముగియనున్నది. జాతర ప్రారంభమైన ఐదవ రోజు శనివారం ఘనంగా కొనసాగింది. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు క్యూ కట్టారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దేవాదాయ శాఖ విస్తృతమైన ఏర్పాట్లు చేసింది. గత ఐదు రోజులుగా తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుండి వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చి, కోట మైసమ్మ తల్లిని దర్శించుకొని, మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా ఈ సంవత్సరం జాతర ప్రారంభమైన మంగళవారం నుండి వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. వాహనాల పూజలకు ఈ దేవాలయం ప్రసిద్ధి చెందింది. రాత్రింబవళ్లు కొనసాగే ఈ జాతరలో వేలాది మంది భక్తులు ఇప్పటికే తమ వాహనాలకు పూజలు చేయించారు. జాతరకు వచ్చిన యువతీ యువకులు, పిల్లలు, జాతర అంతా కలియ తిరుగుతూ, రకరకాల దుకాణాలలో తమకు నచ్చిన బూరలు వంటి వాటిని కొనుగోలు చేస్తూ, సరదాగా బూరెలు ఊదుకుంటూ ,జాతరలో ఏర్పాటుచేసిన రంగులరాట్నాలపై కూర్చుని, సరదాగా తిరుగుతూ సంతోషంతో జాలీగా గడిపారు.. కాగా జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రూరల్ సిఐ ను నావత్ సాగర్ కారేపల్లి





ఎస్ ఐ బైరు గోపి లు పర్యవేక్షణలో తీసుకున్న భద్రత ఏర్పాట్లు విజయవంత మయ్యాయి. ప్రధానంగా ట్రాఫిక్ నియంత్రణలో చేపట్టిన చర్యలు మంచి ఫలితాలను ఇచ్చాయి.

# ఖమ్మంలో గిరిజన కుటుంబాలకు న్యాయసేవలను చేరువ చేసిన డీఎల్ఎస్ఏ 60 రోజుల మెగా డ్రైవ్.

ఖమ్మం అక్టోబర్ 24 మీ వార్త ప్రతినిధి:

ఖమ్మంలో గిరిజన కుటుంబాలకు న్యాయసేవలను చేరువ చేసిన డీఎల్ఎస్ఏ 60 రోజుల మెగ డ్రైవ్ నాల్సా పథకాల లక్ష్యాలను క్షేత్రస్థాయిలో అమలు చేస్తూ చెరుకుపల్లిలో 122 కార్మిక కార్డుల నమోదు, న్యాయాన్ని పొందడం అంటే కేవలం కోర్టుల్లో కేసుల పరిష్కారానికే పరిమితం కాదు. రోజువారీ కూలీగా పనిచేసే కార్మికుడికి సామాజిక భద్రతా ప్రయోజనాలు అందడం ద్వారా న్యాయం అందుబాటులోకి రావచ్చు. దివ్యాంగుడికి చలనానికి తోడ్పడే పరికరం లభించడం కూడా న్యాయసేవల లక్ష్యంలో భాగమే. ఒక గ్రామంలోని కుటుంబానికి తమకు అర్హత ఉన్న సేవలను పొందేందుకు అవసరమైన అధికారిక ప్రక్రియలను అర్థం చేసుకోవడంలో సహాయం అందడం కూడా అంతే ముఖ్యమైనది.న్యాయసేవల పట్ల ఈ విస్తృత దృక్పథంతో, జాతీయ న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా న్యాయసేవాధికార సంస్థ చేపట్టిన 60 రోజుల మెగా డ్రైవ్ అక్టోబర్ 23న ముగిసింది. బలహీన వర్గాలకు చెందిన ప్రజలను చేరుకోవడం, వారి అవసరాలను గుర్తించడం, జిల్లా యంత్రాంగం మరియు సంబంధిత ప్రభుత్వ శాఖల సమన్వయంతో వారికి చట్టపరమైన రక్షణలు, అర్హతలకు అనుగుణమైన ప్రయోజనాలు అందేలా సహకరించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం.ఖమ్మం ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి, డీఎల్ఎస్ఏ చైర్మన్ శ్రీ ఎం. నాగరాజు నాయకత్వంలో, డీఎల్ఎస్ఏ కార్యదర్శి శ్రీమతి పి. దేవి మానస సమన్వయం, అమలు చర్యలతో పాటు డీఎల్ఎస్ఏ సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్ల సహకారంతో ఈ డ్రైవ్ నిర్వహించారు. సత్తుపల్లి మండలంలోని చెరుకుపల్లి గ్రామాన్ని ప్రత్యేక కార్యక్రమం కోసం ఎంపిక చేశారు. ఈ గ్రామంలో 424 గృహాలు ఉండగా, మొత్తం జనాభా 1,243 మంది. వీరిలో 1,063 మంది గిరిజనులు ఉన్నారు. పథకాలపై అవగాహన లేకపోవడం, అవసరమైన పత్రాలను సమకూర్చుకోవడంలో ఇబ్బందులు, వివిధ ప్రభుత్వ కార్యాలయాలను సంప్రదించాల్సిన పరిస్థితులు వంటి కారణాలతో ప్రజలకు ఎదురయ్యే అడ్డంకులను తొలగించేందుకు ఈ కార్యక్రమం కృషి చేసింది. ప్రత్యేక కార్మిక కార్డుల కార్యక్రమంలో 122 కార్మిక కార్డులు నమోదు చేయగా, వాటిలో తొమ్మిది కార్డులు లబ్ధిదారులకు జారీ అయ్యాయి. అదనంగా 37 ఆధార్ నమోదు, సవరణ సేవలను అందించేందుకు




సహకరించారు. అర్హులైన లబ్ధిదారులకు నాలుగు మరుగుదొడ్ల నిర్మాణానికి అనుమతులు మంజూరు కాగా, రెండు వీల్‌చైర్లు కూడా మంజూరయ్యాయి. రోటరీ లయన్స్ సంస్థ సహకారంతో ఒక జైపూర్ ఫుట్ కృత్రిమ కాలు అందించేందుకు సహకరించారు. ఈ కార్యక్రమాలన్నీ జిల్లా యంత్రాంగం, సంబంధిత ప్రభుత్వ శాఖల సమన్వయంతో చేపట్టారు. ఈ డ్రైవ్ నాల్సా రూపొందించిన గిరిజన హక్కుల పరిరక్షణ, అమలు పథకం,2015 పేదరిక నిర్మూలన పథకాల సమర్థవంతమైన అమలు పథకం, 2015 అసంఘటిత రంగ కార్మికులకు న్యాయసేవల పథకం, 2015 లక్ష్యాలకు అనుగుణంగా సాగింది. ఈ పథకాలు అణగారిన వర్గాలకు న్యాయసేవలను చేరువ చేయడం, చట్టపరమైన హక్కులపై అవగాహన కల్పించడం, వర్తించే ప్రయోజనాలను పొందేందుకు అర్హులైన వారికి సహకరించడం వంటి లక్ష్యాలకు మార్గదర్శకంగా నిలుస్తాయి. గ్రామస్థాయిలో ప్రజలను చేరుకోవడం, వారి అవసరాలను గుర్తించడం, దరఖాస్తుల ప్రక్రియలో సహాయం చేయడం, సంబంధిత అధికారులతో సమన్వయం చేయడం కోసం 20 మంది పారా లీగల్ వాలంటీర్లను నియమించారు. డీఎల్ఎస్ఏ సిబ్బందితో కలిసి వారు ప్రజలను సంబంధిత అధికారులకు అనుసంధానించడంలో కీలక పాత్ర పోషించారు. న్యాయసేవలు ఎక్కడ లభిస్తాయో లేదా దరఖాస్తు ప్రక్రియను ఎలా పూర్తి చేయాలో తెలియని ప్రజలకు ఈ క్షేత్రస్థాయి సహకారం ఎంతో ఉపయోగకరంగా నిలుస్తుంది.అక్టోబర్ 17న నిర్వహించిన కార్యక్రమంలో జస్టిస్ సూరేపల్లి నందా పాల్గొని అర్హులైన లబ్ధిదారులకు ప్రయోజనాలను పంపిణీ చేశారు. అక్టోబర్ 23న డ్రైవ్ ముగిసే వరకు తదుపరి సమన్వయం, ప్రయోజనాల కల్పనకు సంబంధించిన సహాయక చర్యలు కొనసాగాయి. బలహీన వర్గాలకు చెందిన ప్రజలకు చట్టపరమైన రక్షణలు, ప్రభుత్వ సేవలు అందించడంలో డీఎల్ఎస్ఏ ఒక వారధిగా పనిచేస్తోందని ఈ కార్యక్రమం తెలియజేస్తోంది. న్యాయసేవల సిబ్బంది, జిల్లా యంత్రాంగం, ప్రభుత్వ శాఖలు, గ్రామస్థాయి వాలంటీర్లను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా నాల్సా పథకాల లక్ష్యాలను ఆచరణాత్మక సహాయంగా మార్చేందుకు డీఎల్ఎస్ఏ ఖమ్మం కృషి చేసింది.ఈ కార్యక్రమం వెనుక ఉన్న ప్రధాన సూత్రం ఒక్కటే హక్కుల గురించి వివరించడం మాత్రమే కాకుండా, ప్రజలు ఆ హక్కులను వినియోగించుకునేలా సహకరించినప్పుడే న్యాయసేవల అసలు లక్ష్యం నెరవేరుతుంది. న్యాయసేవలు క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరువైనప్పుడు, కాగితాలపై ఉన్న హక్కులకు, వాస్తవ జీవితంలో లభించే సహాయానికి మధ్య ఉన్న అంతరాన్ని తగ్గించవచ్చు.60 రోజుల డ్రైవ్ ముగిసినప్పటికీ, దాని విస్తృత సందేశం ప్రాధాన్యతను కోల్పోదు. బలహీన వర్గాల ప్రజలు ఎదుర్కొనే రోజువారీ సమస్యలను గుర్తించి, వారి హక్కులు ఆచరణలో అందుబాటులోకి వచ్చేలా సంస్థలు కృషి చేసినప్పుడే న్యాయానికి నిజమైన అర్థం చేకూరుతుంది.

# రాష్ట్రస్థాయి శిక్షణలో దమ్మపేట సర్పంచ్ పగడాల రమాదేవి.

**- ఆర్టీఐ చట్టం, గ్రామసభల నిర్వహణపై అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్.**

**దమ్మపేట అక్టోబర్ 24 మీ వార్త ఆర్ సి వనమాల శ్రీనివాసరావు:**

గ్రామీణ పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడంతో పాటు ప్రజాస్వామ్య పాలనను గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం హైదరాబాద్ ఆధ్వర్యంలో అక్టోబర్ 22 నుంచి 24 వరకు మూడు రోజులపాటు సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ), గ్రామసభల నిర్వహణపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఎంపిక చేసిన సర్పంచులు ఈ కార్యక్రమంలో పాల్గొని గ్రామ పరిపాలనకు సంబంధించిన పలు అంశాలపై అవగాహన పొందారు. ఈ రాష్ట్రస్థాయి శిక్షణ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, అశ్వారావుపేట నియోజకవర్గంలోని దమ్మపేట గ్రామ సర్పంచ్ పగడాల రమాదేవి పాల్గొనడం విశేషం. శిక్షణలో భాగంగా సమాచార హక్కు చట్టం ద్వారా ప్రజలకు కలిగే ప్రయోజనాలు, ప్రభుత్వ పాలనలో పారదర్శకత ఆవశ్యకత, ప్రజలకు సమాచారం అందించడంలో స్థానిక సంస్థల బాధ్యతలు, గ్రామసభల నిర్వహణ విధివిధానాలు, గ్రామాభివృద్ధి ప్రణాళికల్లో ప్రజల భాగస్వామ్యం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. గ్రామసభలు గ్రామ ప్రజాస్వామ్యానికి పునాదులని, గ్రామ అభివృద్ధికి సంబంధించిన నిర్ణయాల్లో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని ఈ కార్యక్రమం ద్వారా వివరించారు. గ్రామసభలను నిబంధనలకు అనుగుణంగా నిర్వహించడం, ప్రజల సమస్యలను చర్చించడం, అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలను ప్రజల ముందుంచడం, ప్రభుత్వ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు చేరేలా పర్యవేక్షించడం వంటి అంశాలపై శిక్షణ అందించారు. రాష్ట్రస్థాయిలో ఎంపికైన సర్పంచులలో దమ్మపేట సర్పంచ్ పగడాల రమాదేవి పాల్గొనడం గ్రామానికి గుర్తింపుగా నిలుస్తోంది. మూడు రోజుల శిక్షణ





కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసుకున్న ఆమెకు గ్రామస్థులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు అభినందనలు తెలియజేస్తున్నారు. ఈ శిక్షణ ద్వారా పొందిన అవగాహనను గ్రామ పరిపాలనలో అమలు చేస్తూ, ప్రజలకు మరింత పారదర్శకమైన సేవలు అందించేందుకు కృషి చేయాలని పలువురు ఆకాంక్షిస్తున్నారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధి, పారదర్శక పాలనతో ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ఇలాంటి శిక్షణ కార్యక్రమాలు స్థానిక ప్రజాప్రతినిధులకు ఎంతగానో దోహదపడతాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత.

**- ప్రజలకు మెరుగైన రవాణా, విద్యుత్, త్రాగునీటి సదుపాయాల కల్పనకు చర్యలు.**

**- చింతకాని మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసిన డిప్యూటీ సీఎం.**

**ఖమ్మం చింతకాని అక్టోబర్ 24 మీ వార్త ప్రతినిధి:**

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌళిక సదుపాయాల కల్పనే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. గ్రామాల్లో రహదారులు, విద్యుత్, త్రాగునీటి సదుపాయాలను మెరుగుపరుస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా మధిర నియోజకవర్గంలోని చింతకాని మండలంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పర్యటించారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్. ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డిలతో కలిసి మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి, పూర్తయిన పనులను ప్రారంభించారు. చింతకాని మండలం పొద్దుటూరు గ్రామంలో రూ. 3.5 కోట్లతో చేపట్టనున్న 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు, తిమ్మినేని పాలెం గ్రామంలో రూ. 8.25 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు రామకృష్ణాపురం గ్రామంలో రామకృష్ణాపురం నుంచి కొత్తగూడెం వరకు దేవరపల్లి హైవేను కలుపుతూ రూ. 3 కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, రామకృష్ణాపురం నుంచి



పెద్దగోపతి రోడ్డు వరకు రూ. 50 కోట్లతో చేపట్టనున్న రహదారి విస్తరణ, బలోపేతం పనులకు, కొదుమూరు గ్రామంలో వెంకటపాలెం నుంచి చింతకాని రోడ్డు వరకు రూ. 60 కోట్లతో నాలుగు వరుసల రహదారిగా చేపట్టనున్న విస్తరణ, బలోపేతం పనులకు డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేశారు. తిమ్మినేని పాలెం ఎస్సీ కాలనీలో రూ. 62 లక్షలతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లను, గాంధీనగర్ ఎస్సీ కాలనీలో రూ. 46 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌళిక సదుపాయాలను కల్పిస్తూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలను మెరుగుపరిచేందుకు రహదారుల నిర్మాణం, విస్తరణ పనులు చేపడుతున్నామని తెలిపారు. మెరుగైన రహదారుల వల్ల గ్రామాల మధ్య రాకపోకలు సులభతరమౌతుందని పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన



విద్యుత్ సరఫరా అందించేందుకు విద్యుత్ మౌళిక సదుపాయాలను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. నూతన సబ్‌స్టేషన్ల నిర్మాణంతో పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా వ్యవస్థ మెరుగుపడేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. గ్రామీణ ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన పంపిణీ వ్యవస్థలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, సంబంధిత అధికారులు పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ప్రజా సంక్షేమం, గ్రామీణాభివృద్ధిని సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ప్రజలకు అభివృద్ధి పనుల ప్రయోజనాలు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటున్నామని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, కొదుమూరు శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ వేముల సతీష్, ప్రజాప్రతినిధులు, సంబంధిత జిల్లా అధికారులు, స్థానిక నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ గా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రాశీరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని గెలిపించండి.

**- మేకల మల్లిబాబు యాదవ్ గుజ్జర్లపూడి రాంబాబు.**

**కామేపల్లి అక్టోబర్ 24 మీ వార్త ప్రతినిధి:**

ఖమ్మం- వరంగల్ -నల్గొండ నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని డిసిసిబి డైరెక్టర్ మేకల మల్లి బాబు యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గుజ్జర్లపూడి రాంబాబు, జిల్లా కార్యదర్శి షేక్ ఫతే మహమ్మద్, పిఎసిఎస్ అధ్యక్షులు పుచ్చకాయల వీరభద్రం, ధనియాకుల హనుమంతరావు,జిల్లా నాయకులు తోటకూరి శివయ్య, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గుగులోత్ గబ్రు నాయక్ పిలుపునిచ్చారు. కామేపల్లి మండలం కొత్త లింగాల ధనలక్ష్మి ఫంక్షన్ హాల్ లో శనివారం మండల స్థాయిలో పట్టభద్రులతో సమావేశం నిర్వహించారు. భారీగా హాజరైన పట్టభద్రు లను ఉద్దేశించి మల్లిబాబు యాదవ్ మాట్లాడుతూ గత ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసం వలన తెలంగాణ అభివృద్ధి కుంటుపడినప్ప టికీ, ఇచ్చిన మాటకు కట్టుబడి రేవంత్ రెడ్డి హయాంలో మహిళలకు ఫ్రీ బస్సు పథకం, 200 యూనిట్లు లోపు ఉచిత విద్యుత్ పథకం, రైతుబంధు,రైతు బీమా లాంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తూ, ఖమ్మం జిల్లాలో సాగునీరు త్రాగునీటి కోసం సీతారాం ప్రాజెక్టు ద్వారా కాలువలు చెరువులు నింపే ప్రయత్నం చేస్తున్నారని



వివరించారు. అభ్యర్థి విషయంలో పార్టీ తగు నిర్ణయం తీసుకున్నదని, రాంరెడ్డి కుటుంబం అంటే ఒక బ్రాండ్ అని, రాష్ట్ర వ్యాప్తంగా ఆ కుటుంబానికి మంచి పేరు ఉన్నదని, ప్రజలలో వారికి ఉన్న మంచితనానికి రాజకీయ అనుభవానికి పార్టీ గుర్తించిందని, అంతేకాకుండా ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి తండ్రి మాజీ మంత్రి కీ. శే.రాంరెడ్డి దామోదర్ రెడ్డి, పెదనాన్న కీ.శే రాంరెడ్డి వెంకట రెడ్డి ఆశయాల మేరకు ఉన్నతమైన భావాలతో ప్రజలకు సేవ చేస్తున్నారని, ఎంతో ఉన్నతమైన చదువులు చదివి కూడా ప్రజాసేవకు అంకితమయ్యారని, అలాంటి వ్యక్తిని గెలిపించుకోవడం వలన ప్రజా సమస్యలు పరిష్కారం అయ్యే అవకాశం ఉన్నదని, కావున 2023 నవంబర్ ఒకటికి ముందు ఉత్తీర్ణులైన పట్టభద్రులు 18 ఫారం ద్వారా రిజిస్టర్ చేసుకోవాలని, మండలం లో ప్రతి గ్రామంలో



గ్రాడ్యుయేట్ లను నమోదు చేసే కార్యక్రమం కాంగ్రెస్ పార్టీ చేపట్టిందని,పార్టీ కార్యకర్తలు,నాయకులు గ్రామం లోని ప్రతి ఇంటింటికి వెళ్లి పట్టభద్రుల ఓట్లు నమోదు చేసే బాధ్యత తీసుకోవాలని పిలుపుని చ్చారు. ఈ సమావేశంలో కొమ్మినేపల్లి సర్పంచ్ ధరావత్ అనురాధ, పింజరమడుగు సర్పంచ్ జి. భాష, టేకుల తండా సర్పంచ్ జె.రెడ్డి, సాతాని గూడెం సర్పంచ్ రెడ్యా, మాజీ ఎంపీపీ మాలోత్ సరిరామ్ నాయక్, కొమ్మినేని శ్రీనివాసరావు, ఉప్పుగండ్ల వీరభద్రం, ఆలోత్ శివ, సత్తి వీరబాబు, గుగులోతు రవి, కోల వెంకటేశ్వర్లు,చల్ల మల్లయ్య, పగిడిపల్లి కాటయ్య,పుచ్చకాయల అప్పారావు,మల్లెంపాటి అప్పారావు,బద్రు గాడేపల్లి రవి,శ్రీరాములు,పాటిబండ్ల ప్రసాద్, శీలం పుల్లయ్య, జక్కంపూడి వెంకటేశ్వర్లు, పండగ కోటి తదితరులు పాల్గొన్నారు.

# రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డిని కలిసిన టీఎన్జీవో నాయకులు

**నిజామాబాద్** : నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే రేకులపల్లి భూపతిరెడ్డిని టీఎన్జీవో నాయకులు మర్యాదపూర్వకంగా కలిసారు. శనివారం నిజామాబాద్ రూరల్ క్యాంప్ కార్యాలయంలో టీఎన్జీవో నిజామాబాద్ జిల్లా పక్షాన మర్యాదపూర్వకంగా కలిసి, శాలువాతో సన్మానించి దసరా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లా ఉద్యోగుల సమస్యలపై చర్చించగా సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినందుకు ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్, టీఎన్జీవో జిల్లా అధ్యక్షులు నాశెట్టి సుమన్ కుమార్, టీఎన్జీవో జిల్లా కార్యదర్శి నేతికుంట శేఖర్, రాష్ట్ర కార్యదర్శి పోల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షులు గుడికందుల సంజీవయ్య, జాఫర్ హుస్సేన్, కోశాధికారి నిరంజన్ గౌడ్, టీఎన్జీవో అర్బన్ యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు జాకీర్ హుస్సేన్, నూత్ పల్లి మారుతి తదితరులున్నారు.



# ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి అభివృద్ధి పనులు, వైద్య సేవలపై సమీక్ష.





**ఖమ్మం అక్టోబర్ 24 మీ వార్త ప్రతినిధి:**

ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి జీజీహెచ్లో ఈ రోజు గౌరవనీయులైన అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు శ్రీజ మేడం ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశానికి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి. రామారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో వైద్య సేవల నిర్వహణ, వైద్యుల హాజరు, పరికరాల కొనుగోలు, రోగుల రవాణాకు అవసరమైన స్ట్రెక్చర్ ల సమకూర్పు, కొనసాగుతున్న భవన నిర్మాణ పనులు, ఖాళీ పోస్టుల భర్తీ ప్రక్రియ, ఆసుపత్రి విభాగాల తరలింపు వంటి అంశాలపై సమీక్షించారు. అక్టోబర్ 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి మరియు జిల్లా ఆసుపత్రుల వైద్యుల విధులకు హాజరు, విధులకు వచ్చిన మరియు వెళ్లిన సమయాల వివరాలు; ఆసుపత్రులకు అవసరమైన పరికరాల కొనుగోలుకు సంబంధించిన జాబితా స్ట్రెక్చర్ ల కొనుగోలు పురోగతి తెలంగాణ వైద్య మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ మరియు ఖమ్మం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న నిర్మాణ పనుల వివరాలు నియామక ప్రక్రియ పురోగతి ఆసుపత్రి విభాగాల తరలింపు స్థితిగతులకు సంబంధించిన నివేదికలను సమర్పించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలను మరింత మెరుగుపరచడం, మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడం, ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా చూడడం ఈ సమీక్ష సమావేశం ప్రధాన ఉద్దేశమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ డి. రామారావు తెలిపారు. ఈ సమావేశంలో జి జి హెచ్ మెడికల్ సూపర్ ఇండెంట్ డాక్టర్ నరేంద్ర, డి సి హెచ్ ఎస్ డాక్టర్ రాజశేఖర్ గౌడ్, ఇన్చార్జ్ మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ రాజేశ్వరరావు, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ వేణు మాధవరావు, ఏవో మమత ఇంకా ఆల్ హెచ్వోడీస్ పాల్గొన్నారు.

# అమెరికాలో నల్లమల అక్షిత మృతి పట్ల కుటుంబ సభ్యులను పరామర్శించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు.





**ఖమ్మం అక్టోబర్ 24 మీ వార్త ప్రతినిధి:**

అమెరికాలో గుండె పోటుతో మరణించిన ఖమ్మం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఎగుమతి శాఖ అధ్యక్షుడు నల్లమల ఆనంద్ కుమార్తె కీర్తి శేషులు నల్లమల అక్షిత చిత్ర పటానికి వారి నివాసంలో పూలమాల వేసి నివాళులు అర్పించి,కుటుంబ సభ్యులను పరామర్శించిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. శోక సముద్రంలో ఉన్న కుటుంబ సభ్యులను ఓదార్చి,ఇంత చిన్న వయసులోనే మరణించడం పట్ల ఆవేదనను వ్యక్తం చేశారు.ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

# పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

**నిబంధనల అమలుపై నిశిత పరిశీలన**



**నిజామాబాద్** : జిల్లా కేంద్రంలోని అర్సపల్లిలో గల ఏ.వీ ఎంటర్ ప్రైజెస్ సెంటర్ లో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో శనివారం అసిస్టెంట్ సైంటిస్టు (పొల్యూషన్ కంట్రోల్ బోర్డు) పోస్టుల భర్తీ కోసం సీ.బీ.టీ విధానంలో ఎగ్జామ్ నిర్వహించగా,పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరుతెన్నులను నిశితంగా పరిశీలించారు. అభ్యర్థుల హాజరు గురించి ఆరా తీశారు. సీ.సీ. కెమెరాలు పని చేస్తున్నాయా లేదా అన్నది గమనించారు. బయో-మెట్రిక్ హాజరు సేకరణలో ఏమైనా ఇబ్బందులు తలెత్తాయా అని నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కాపీయింగ్ కు అవకాశం లేకుండా పరీక్షా కేంద్రంలోని ఆయా గదుల వద్ద చేసిన ఏర్పాట్లను, తాగునీటి వసతి, ప్రథమ చికిత్స వసతులతో కూడిన ఏ.ఎన్.ఎం బృందాలు అందుబాటులో ఉన్నారా లేదా అని గమనించారు. ప్రధాన ప్రవేశ మార్గం వద్ద ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి అనుమతించడం జరిగిందని పరీక్షా కేంద్రం నిర్వాహకులు కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఎగ్జామ్ హాల్లోకి సెల్ ఫోన్లు, స్మార్ట్ వాచ్, ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలకు అనుమతి లేనందున అభ్యర్థులను మెటల్ డిటెక్టర్లలతో క్షుణ్ణంగా తనిఖీ చేశామన్నారు. పరీక్షా కేంద్రంలోని ఆయా గదులను సందర్శిస్తూ, అభ్యర్థులకు అందుబాటులో ఉంచిన సదుపాయాలను గమనించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్దేశించిన నిబంధనలను తు.చ తప్పకుండా అమలు చేస్తూ, ప్రశాంత వాతావరణంలో సజావుగా పరీక్ష జరిగేలా పర్యవేక్షణ చేయాలన్నారు. పరీక్ష సమయం ముగిసేంత వరకు ఎవరు కూడా బయటకు వెళ్లకుండా చూడాలని అన్నారు. ఈ నెల 26న జరుగనున్న పరీక్షలను కూడా కట్టుదిట్టంగా నిర్వహించాలని సూచించారు.

## కుష్టు వ్యాధి లక్షణాలను గుర్తించి చికిత్స పొందాలి



సూపర్వైజర్ మేరీ

**ఇందల్వాయి: :** మండలంలోని గంగారం తండా గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించిన జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో సూపర్వైజర్ మేరీ పాల్గొని ప్రజలకు వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మానవ చరిత్రలో కుష్టు వ్యాధి ప్రాచీన వ్యాధుల్లో ఒకటని, వ్యాధి లక్షణాలను ప్రారంభ దశలో గుర్తించి చికిత్స పొందడం ఎంతో ముఖ్యమని తెలిపారు. శరీరంపై తెలుపు, రాగి లేదా ఎరుపు రంగులో కనిపించే మచ్చలతో పాటు, ఆ ప్రాంతంలో స్పర్శజ్ఞానం తగ్గడం లేదా పూర్తిగా కోల్పోవడం కుష్టు వ్యాధి లక్షణాలు కావచ్చని వివరించారు. నరాలు లావుగా మారడం, నొప్పి కలగడం, చేతులు, పాదాల్లో స్పర్శజ్ఞానం కోల్పోవడం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు.ప్రజలు సమీప ప్రభుత్వ ఆసుపత్రి లేదా ఆరోగ్య కేంద్రానికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని ఆమె కోరారు. గతంలో కుష్టు వ్యాధికి చికిత్స పొందినవారు, అంగవైకల్యం కలిగిన బాధితులు సమీప ఆరోగ్య కేంద్రంలో తమ పేర్లను నమోదు చేసుకోవడం ద్వారా అంగవైకల్య నివారణకు సంబంధించిన సేవలు, ఇతర వైద్య సదుపాయాలు పొందవచ్చని తెలిపారు.కుష్టు వ్యాధికి చికిత్స పొంది కోలుకున్నవారికి పునరావాసం కల్పించడం ద్వారా సమాజంలో గౌరవప్రదమైన జీవితం అందించవచ్చని పేర్కొన్నారు. వ్యాధిపై అపోహలు వీడి, బాధితుల పట్ల వివక్ష చూపకుండా ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్లు జ్యోతి, గంగమణి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

**వేతనాలు పెంచాలని సీఐటీయూ ఆధ్వర్యంలో చలో హైదరాబాద్‌కు పిలుపు**



**ఇందల్వాయి:** ఇందల్వాయి మండల కేంద్రంలోని ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించి, వారి వేతనాలను పెంచాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం అసెంబ్లీ సమావేశాల సందర్భంగా చలో హైదరాబాద్ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. చాలాకాలంగా ఆశా వర్కర్లు వెట్టిచాకిరీ చేస్తున్నప్పటికీ, వారి సమస్యలను గత ప్రభుత్వం పట్టించుకోలేదని, ప్రస్తుత ప్రభుత్వం కూడా వారి సమస్యలపై స్పందించకపోవడం విచారకరమని ఆశా వర్కర్లు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారంలోకి రాకముందు ఒక మాట, గద్దెనెక్కిన తర్వాత మరో మాట అన్న చందంగా ప్రభుత్వాల వ్యవహారశైలి ఉందని వారు విమర్శించారు. ఆశా వర్కర్ల కష్టాలు ప్రభుత్వానికి పట్టడం లేదని, తమ శ్రమకు తగిన వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు.ప్రభుత్వం తమ సమస్యలను గుర్తించి, వేతనాల పెంపుపై వెంటనే నిర్ణయం తీసుకోవాలని ఆశా వర్కర్లు కోరారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు, ధర్నాలు చేపట్టి ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## కలెక్టర్ ను కలిసిన పౌర సంబంధాల డైరెక్టర్



**కామారెడ్డి** జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌ను పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్, ఐఏఎస్, శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్‌కు పూల మొక్కను అందజేశారు.

## త్వరితగతిన బియ్యం సరఫరా చేయాలి



**కామారెడ్డి :** రైస్ మిల్లర్లకు ఆదేశాలు జారీ చేసిన పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ శ్యాం ప్రసాద్ లాల్కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ జి.వి. శ్యాం ప్రసాద్ లాల్ అధ్యక్షతన బియ్యం సరఫరాపై రైస్ మిల్లర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటేష్, డీఎం శ్రీకాంత్, రైస్ మిల్లర్ల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ మాట్లాడుతూ, రైస్ మిల్లర్లు ప్రభుత్వానికి అందించాల్సిన బియ్యం నిల్వలు, సరఫరా ప్రక్రియను సమీక్షించారు. బియ్యం పంపిణీలో ఎలాంటి జాప్యం జరగకుండా, నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా త్వరితగతిన బియ్యం సరఫరా చేయాలని రైస్ మిల్లర్లను ఆదేశించారు. బియ్యం సరఫరాలో నిర్లక్ష్యం వహించకుండా, సంబంధిత అధికారులు సమన్వయంతో పనిచేస్తూ నిర్దేశిత గడువులోగా లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు.

# నాణ్యతతో మూడు నెలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం పూర్తి చేయాలి.

- ప్రతి రెండు, మూడు వారాలకు నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించాలి.
- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు.

**ఖమ్మం అక్టోబర్ 24 మీ వార్త ప్రతినిధి:**





నిన్న మధ్యాహ్నం నాణ్యతా ప్రమాణాలతో మూడు నెలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అధికారులను ఆదేశించారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్ వైఎస్ఆర్ కాలనీలో ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఎంపీపీఎస్ లో సుడా నిధులు రూ.1.30 కోట్లతో చేపట్టనున్న ఐదు అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వర రావు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ పాఠశాలలో నిర్మించనున్న అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో మూడు నెలల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి రెండు, మూడు వారాలకు ఒకసారి పనుల పురోగతిని అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సమీక్షించాలని సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడకుండా నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.వైఎస్ఆర్ కాలనీలో నివసిస్తున్న ప్రతి కుటుంబానికి నిబంధనల ప్రకారం కొత్త విద్యుత్ మీటర్లు అందించేలా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. కాలనీలో ఇళ్లలో నివసిస్తున్న వారికి ఇంటి పన్ను ధృవీకరణ పత్రాలు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఎవరూ అక్రమంగా విద్యుత్ వినియోగించ కూడదని, ప్రతి ఇంటికి సరైన విద్యుత్ మీటర్ ఏర్పాటు చేయడంతో పాటు ఇంటి పన్ను ధృవీకరణ పత్రం కూడా అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మంత్రి తెలిపారు. కాలనీలో నివసించే ప్రతి ఒక్కరూ నిబంధనల ప్రకారం విద్యుత్ సేవలను వినియోగించుకునేలా చూడాలన్నారు.2023లో మంజూరైన డబుల్ బెడ్‌రూం ఇళ్లకు సంబంధించి ఇంకా పెండింగ్‌లో ఉన్న సమస్యలను గుర్తించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అధికారులను ఆదేశించారు. లబ్ధిదారులకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత అంశాలపై సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, మునిసిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, సంబంధిత అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిపక్షాల దిగజారుడు రాజకీయాలను తిప్పికొట్టాలి.

- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్.

**ఖమ్మం అక్టోబర్ 24 మీ వార్త ప్రతినిధి:**

జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ ప్రతి పక్షాల దిగజారుడు రాజకీయాలను తిప్పికొట్టాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో డిసిసి అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ ప్రజా భవన్ లో టిపిసిసి అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యే లు, డిసిసి అధ్యక్షులతో జరిగిన సమావేశ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్ నినో పై ప్రతిపక్షాల విమర్శలు ప్రపంచ వ్యాప్తంగా ఎల్ నినో కారణంగా తీవ్ర సంక్షోభం ఏర్పడిందని ఇది ప్రకృతి వైపరీత్యం. దీనిని అడ్డుపెట్టుకొని బీఆర్ఎస్, బీజేపీ ప్రతిపక్షాలు ప్రభుత్వంపై విమర్శలు చేయడం దిగజారుడు రాజకీయం అని ఆరోపించారు. ప్రతిపక్షాల విమర్శలను తిప్పికొట్టడానికి గ్రామ గ్రామాన ప్రజలకు ఎల్ నినో పై





అవగాహన కల్పించేలా కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నామని ప్రతి కార్యకర్త ప్రజల్లోకి వెళ్లాలనీ సూచించారు.సర్ ప్రక్రియపై రాహుల్ గాంధీ పోరాటానికి మద్దతుగా కేంద్రంలోని మోదీ, అమిత్ షా, బిజెపి ప్రభుత్వం సర్ పేరుతో అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోంది. బడుగు, బలహీన, గిరిజన వర్గాల ఓట్లను తొలగించేందుకు కుట్ర చేస్తోందన్నారు. ఇది రాజ్యాంగ విరుద్ధమని దీనిపై లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఇండియా కూటమితో కలిసి పోరాటం చేస్తున్నారని తెలియజేశారు. రాహుల్ గాంధీ పోరాటానికి మద్దతుగా నవంబర్ 01న ఢిల్లీ రాంలీలా మైదానంలో జరిగే భారీ ర్యాలీకి ఖమ్మం జిల్లా నుండి అధిక సంఖ్యలో కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లి ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి సర్వోత్తం రెడ్డి గెలుపే లక్ష్యం. అందుకోసం ఓటర్ నమోదును వేగవంతం చేయాలి. జిల్లాలోని అనుబంధ సంఘాల అధ్యక్షులు, బ్లాక్, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, జిల్లా కమిటీ సభ్యులు ప్రతి ఒక్కరూ పట్టభద్రులను కలిసి ఓటు నమోదు చేయించాలన్నారు. ఈ గెలుపును అధిష్టానానికి బహుమతిగా ఇవ్వాలన్నారు.

# కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో 15 కుటుంబాలు చేరిక.

**కామేపల్లి అక్టోబర్ 24 మీ వార్త ప్రతినిధి:**





కామేపల్లి మండలం లో కాంగ్రెస్ పార్టీకి చెందిన 15 కుటుంబాలు బిఆర్ఎస్ పార్టీ చేరారు.ఇల్లందు నియోజకవర్గ పరిధిలోని టేకులపల్లి మండలం దాస్ తండా లోని మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ స్వగృహంలో శనివారం జరిగిన ముఖ్య నాయకుల సమావేశానికి ముఖ్య అతి ధిగా కిషన్ రెడ్డి పాల్గొన్నా రు.ఈ సందర్భంగా కామేపల్లి మండలం కెప్టెన్ బంజర,జింకల బంజర గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ 15 కుటుంబాలు రాజీనామా చేసి బీఆర్ఎస్ లో మండల మాజీ అధ్యక్షుడు అంతోటి అచ్చయ్య ఆధ్వర్యంలో చేరారు.వారికి పార్టీ నాయకులు స్వాగతం పలికారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఎన్నికల ఇల్లందు నియోజకవర్గ ఇన్‌చార్జి చాడ కిషన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాధారణంగా ఆహ్వానించా రు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న కాలం బిఆర్ఎస్ పార్టీదే అని ప్రజలంతా కెసిఆర్ బిఆర్ఎస్ పాలన వైపు చూస్తున్నారని అన్నారు. త్వరలో జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలపై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ తీరు ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని అన్నారు.కామేపల్లి మండలం కెప్టెన్ బంజర, జింకల బంజర గ్రామాలకు చెందిన వెన్ను హరికృష్ణ, గుంపెనపల్లి జంగం, బానోతు అఖిల్, మాలోత్ మంజి, కెలోత్ రాజేష్, పొందెం వీరయ్య, అరేం బసవయ్య, అరేం రాంబాబు తదితరులు బీఆర్ఎస్‌లో చేరిన వారిలో ఉన్నారు.ఈ కార్యక్రమంలో బేతంపూడి సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్ రావు,టేకులపల్లి సర్పంచ్ బోడ బాలు, భూక్యా దళ్ సింగ్ నాయక్, రాంపురం సర్పంచ్ బర్మావత్ శివకృష్ణ, బానోతు నరేష్ , మహిళా నాయకురాలు ఆమేడ రేణుక, బానోత్ రామా నాయక్, భూక్యా లాలు, మాలోత్ పుల్ సింగ్, నాగభూషణం,కామేపల్లి మండల నాయకులు అంతోటి అచ్చయ్య, మూడ్ కృష్ణ ప్రసాద్ నాయక్, మల్లెంపాటి శ్రీనివాసరావు, సామ మోహన్ రెడ్డి, కాటాల రాంబాబు,ఉద్యమకారులు దేవిలాల్, ఎస్.కే.నాగుల్ మీరా,గుంపెనపల్లి అనంత రాములు,ఈసం రామ్మూర్తి తదితరులు పాల్గొని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులు,పార్టీ శ్రేణులు ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చా రు.

# వైద్యపరమైన రికార్డులను జాగ్రత్తగా భద్రపర్చాలి

**అర్థమయ్యే రీతిలో ప్రిస్క్రిప్షన్ ఉండాలి**

**వైద్యరంగ నిపుణులకు అవగాహన సదస్సులో జిల్లా జడ్జి**






**నిజామాబాద్ :** వైద్య వృత్తిలో కొనసాగుతున్న వారు వైద్యపరమైన రికార్డులను సక్రమంగా నిర్వహిస్తూ, వాటిని జాగ్రత్తగా భద్రపర్చాలని జిల్లా జడ్జి జీ.వీ.ఎన్.భరతలక్ష్మి సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రధాన సమావేశ మందిరంలో శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులకు, వైద్య రంగ నిపుణులకు వివిధ అంశాలపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా జడ్జి ముఖ్య అతిథిగా విచ్చేయగా, కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు డీ.సీ.పీ శుభం నగ్రాలే తదితరులు పాల్గొన్నారు. వైద్యుల హక్కులు, వైద్య సేవల్లో చట్టపరమైన బాధ్యతలపై జిల్లా జడ్జి, కలెక్టర్, ఇతర వక్తలు ముఖ్య సూచనలు చేశారు. హెల్త్ కేర్ ప్రొఫెషనల్స్ అండ్ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (ప్రివెన్షన్ ఆఫ్ వయలెన్స్) చట్టం--2025, వైద్య రికార్డుల నిర్వహణ, వాటి చట్టపరమైన ప్రాముఖ్యత, న్యాయపరమైన విచారణల్లో వాటి ప్రామాణికత తదితర అంశాలపై ఈ సదస్సులో అవగాహన కల్పించారు. వైద్య సేవలందించే సమయంలో చట్టపరమైన నిబంధనలను పాటించడం, వైద్య రికార్డులను సక్రమంగా నిర్వహించడం, వృత్తిపరమైన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించడం ద్వారా వైద్యులు, రోగుల హక్కులను పరిరక్షించడంతో పాటు న్యాయ ప్రక్రియకు సహకారం అందించిన వారు అవుతారని ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. న్యాయవ్యవస్థలో వైద్యులు భాగస్వాములుగా వ్యవహరించాల్సిన ప్రాముఖ్యత గురించి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.నారాయణ, నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.దుర్గాప్రసాద్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి నీలిమ ముద్దసాని, ట్రైనీ కలెక్టర్ సురేష్, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎన్.సుభాష్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎ.విశాల్, డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్, రాష్ట్ర వైద్య మండలి జిల్లా ఇన్‌చార్జి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దీపక్ రాథోడ్, రాజ్ కుమార్ సుబేదార్, ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.